క్లుప్తంగా

20న పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు

చీరాల అర్బన్: పవిత్ర కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలను సందర్శించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జె.శ్యామల శనివారం ఒక ప్రకటలో తెలిపారు. ఈనెల 20న బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి అల్ట్రా డీలక్స్ బస్సు బయలుదేరుతుందన్నారు. మంత్రాలయం, అలంపూర్ జోగులాంబ దేవాలయం, మహానంది సాంబశివుని దర్శనం చేసుకునేందుకు వీలుగా బస్సును ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 94917 07053 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తేవాలి


భానుచంద్రమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: ఉపాధ్యాయుడు ఎప్పుడూ నిత్య విద్యార్థి అని ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. స్థానిక పేరాలలోని ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పవని భానుచంద్రమూర్తి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న సందర్భంగా శనివారం పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓలు పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి.సుధారాణిలు హాజరయ్యారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకోవడం పాఠశాలకే గర్వకారణమన్నారు. అనంతరం హెచ్ఎం బి.సాల్మన్‌రాజు, స్టాఫ్ సెక్రటరీ వై.గాంధీ తదితరుల ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కె.రాజేంద్రప్రసాద్, వెలుగొండారెడ్డి, యల్లమందేశ్వరరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో సీపీఎం మహాసభ

అద్దంకి రూరల్: సీపీఎం అద్దంకి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లోని ఏచూరి ప్రాంగణంలో మహాసభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. రమాదేవి, పార్టీ జిల్లా కార్యదర్శి గంగయ్య, సభా పరిశీలకులు, పార్టీ జిల్లా నాయకుడు మజుందార్ పాల్గొంటారని తెలిపారు. ప్రాంతీయ కమిటీ అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలతో లాభాలు

బల్లికురవ : పొగాకు సాగుతో నష్టాలతోపాటు అనారోగ్యాల బారిన పడుతున్నందున రైతులు మొక్కజొన్న, అపరాలు, చిరుధాన్యాల సాగు చేపట్టాలని ఏవో ఎస్‌వీపీ కుమారి అన్నారు. శనివారం కూకట్లపల్లి, వెలమవారిపాలెం గ్రామాల్లో రైతులతో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మొక్కజొన్న, అపరాలు, చిరుధాన్యాల సాగులో మెలుకువలతో ఎక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని పొందవచ్చన్నారు.

అద్దంకి రూరల్: పొగాకుకు బదులుగా శనగలు, మొక్కజొన్న, అపరాలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సచివాలయం వద్ద రైతులకు శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ శనగపంటకు విత్తనశుద్ధి, ట్రైకోడెర్మావిరిడితో కేజీ విత్తనానికి 5 గ్రాములు కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. పొలం చుట్టూ రక్షణ పంటగా జొన్నసాగులో ఎర పంటగా ధనియాలు సాగును సూచించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం శేషారావు, వీఏఏ ఖజాబీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్టు

చీరాల: అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళను శనివారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్సై బి.శ్రీహరి, సిబ్బంది శనివారం వేటపాలెం, వాడరేవు, చీరాల రామ్‌నగర్, కావూరివారిపాలెం, జాండ్రపేట పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కావూరివారిపాలెంలోని అంబేడ్కర్ బొమ్మ సెంటర్ వద్ద ఓ మహిళ అక్రమంగా మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి 13 విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉండడం, రవాణా చేయడం నేరమని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అద్దంకి రూరల్: అద్దంకి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.


వృథా నీటిలో నుంచి బయటికి వస్తున్న ప్రజలు


ఇళ్లల్లో నీటిని ఎత్తి పోసుకునేందుకు సమాయత్తమవుతున్న మహిళలు


చుట్టూ నీరు చేరటంతో పనికిరాకుండా పోయిన గోతాలు

ఊరి నిండా నీళ్లు.. ఊసేలేని అధికారులు

- జల దిగ్బంధంలో కొప్పెరపాడు గ్రామం
- సైడు కాల్వలు లేక రోడ్లపై ప్రవహిస్తున్న సాగర్ వృథా నీరు
- పాఠశాల, ఇళ్లల్లోకి చేరిన వైనం
- పట్టించుకోని అధికారులు, కూటమి నేతలు

బల్లికురవ:

ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాల్సిన అవసరం ఉంది. కాని అధికారులు, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సాగర్ నీరు వృథాగా పోతోంది. సైడు కాలువ లేక బల్లికురవ మండలంలోని కొప్పెరపాడు గ్రామం మూడు రోజులుగా జలదిగ్బంధంలో ఉంది. నార్కెట్‌పల్లి–మేదరమెట్ల నామ్ రహదారికి ఇరువైపులా కొప్పెరపాడు గ్రామం విస్తరించి ఉంది. ఈ రోడ్డుకు పడమర భాగంలో ఉన్నత పాఠశాలకు సమీపంలో ఇటీవల కాలంలో వెంచర్లు వేశారు. వెంచర్లతో


ఉన్నత పాఠశాల సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వృథా నీరు

పాటు ప్రహరీలు నిర్మించటం వలన పొలాల్లోని వృథా నీరు గ్రామంలోకి వస్తోంది. సిమెంట్ రోడ్లు వేసి సైడ్ కాలవలు నిర్మించనందున రోడ్లపై గుండానే ఈ వృథా మురుగు నీరు ప్రవహిస్తోంది. ఈ పరిస్థితులకు తోడు అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు అధికమైందని గ్రామస్తులు వివరించారు. ఉన్నత పాఠశాలలో సుమారు 700 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లాలంటే ఈ మురుగు నీటిలో వెళ్లాల్సి వస్తుంది. గహాల్లో కూడా నీరు చేరడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పగలు రాత్రి తేడా లేకుండా ఇళ్లల్లోకి వచ్చిన నీటిని బకెట్లతో ఎత్తిపోసుకుంటున్నారు.

నిమ్మకు నీరెత్తినట్లుగా అధికారులు.

సైడు కాలవలు లేనందున సాగర్ వృథా నీరు గ్రామంలోకి రావటంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే పూర్తిగా జలదిగ్బంధంలో ఉంటున్నామని గ్రామస్తులు పాలకులకు అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీయడంతో అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రజలు. మురుగు, దోమల దాడితో పగలు రాత్రి వారికి జాగారాలు తప్పడం లేదు. గ్రామంలోని పరదా తయారీ యూనిట్ల చూట్టూ మురుగునీరు చేరటంతో గోతాలన్నీ పాడైపోవడంతో వ్యాపారులు నష్టాల పాలయ్యారు.

మురుగు నీటితో దోమల దాడి అధికమైంది..



మురుగునీరు ఇళ్లల్లోకి చేరటంతో దోమల దాడి అధికమైంది. దోమల దాడితో రోగాలు వస్తాయెమోనని భయాందోళన చెందుతున్నాం. మూడు రోజులు ఇళ్ల చుట్టూ వృథా నీరు పారుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు.

– కల్లూరి మాధవి, కొప్పెరపాడు

సైడు కాలువలు నిర్మించాలి..



సిమెంట్ రోడ్లు నిర్మించి సైడ్ కాలువలు ఏర్పాటు చేయనందున సాగర్ వృథా నీరు, వర్షపు నీరు ఇళ్లల్లోకి ప్రవహిస్తోంది. మూడు రోజులుగా జలదిగ్బంధంలోనే ఉన్నాం. ఇంటి చుట్టూ కూడా మురుగునీరు నిలవ ఉండటంతో విషసర్పాల సంచారం కూడా అధికమైంది. గ్రామ పంచాయతీ అధికారులు తగు చర్యలు చేపట్టాలి.

– మక్కెన రామారావు, కొప్పెరపాడు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


చినగంజాం: విద్యార్థులకు వ్యాసరచనపోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్


సంతమాగులూరులో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీరాల అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయోద్యమ పితామహులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణంలకు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నాకు నచ్చిన పుస్తకం అనే అంశంపై నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బత్తుల సర్వీస్ ట్రస్టు అధ్యక్షుడు బత్తుల బ్రహ్మారెడ్డి, గీతా ట్రస్ట్ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు చుండూరి కృష్ణమూర్తి హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డీ.ధనమ్మ, ఎం.లూకా, రవికుమార్, వడలి రాధాకృష్ణ, రాణెమ్మ, కె.కిషోర్‌బాబు, పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు సంతమాగులూరు శాఖా గ్రంథాలయంలో నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు కోడెల శ్రీనివాసరావు గ్రంథాలయ ఉద్యమాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డు అధ్యాపకుడు ఎండీ అల్తాఫ్, లైబ్రేరియన్ విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చినగంజాం: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ మోహన లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చంద్రయాన్–3 పై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డీ రత్నకుమారి, జేవీవీ మండల కన్వీనర్ ఎస్ నరసింహారావు, ఆర్ పోతురాజు, ఎల్‌ఐసీ డీఓ శ్రీరామచంద్రమూర్తి, తెలుగు ఉపాధ్యాయులు వీరేశ్వర శాస్త్రి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చీరాలలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పిస్తున్న అతిథులు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహ్మద్ ఆఖీద్ జావెద్

యద్దనపూడి: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ మహ్మద్ ఆఖీద్ జావెద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం సభ్యులు హాజరుకాకపోవటంతో ఒక గంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. సమావేశంలో వ్యవసాయ, నీటిపారుదల, పంచాయతీరాజ్, గృహనిర్మాణ తదితర శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు గురించి సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో వారంరోజుల క్రితం గుండెపోటుతో మరణించిన పశువైద్యాధికారి సురేష్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనంపాటించి తమ సంతాపం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఉపాధికల్పన, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వింజనంపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో తహశీల్దారు రవికుమార్, ఈఓఆర్డీ కృష్ణ, ఏవో మేరమ్మ, ఏపీఓ రమేష్, ఏపీఎం వెంకట్రావు, ఎంఈఓ గోపి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత, వైద్యాధికారి శ్రీహర్ష, పంచాయతీరాజ్ ఏఈ ఆనందరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, హౌసింగ్ ఏఈ రాహుల్, ఏపీఎస్ ఆర్టీసీ సూపరింటెండెంట్ పి. వెంకట్రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు


సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఇన్‌చార్జి తహశీల్దార్ అనిత

స్వర్ణ (కారంచేడు): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని లేకపోతే శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని ఇన్‌చార్జ్ తహశీల్దారు అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె మండలంలోని స్వర్ణ గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో కార్యాలయంలో కొంత మంది ఉద్యోగులు గైర్హాజరైనట్లు ఆమె గుర్తించారు. కార్యాలయంలో ఉన్న సిబ్బందితో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సమయానికి కార్యాలయానికి రావాలన్నారు. అలాగే సమయానికి ఎఫ్ఆర్ఎస్‌ల ద్వారా హాజరు వేయాలన్నారు. సమయపాలన పాటించని సిబ్బందికి మొదటిగా మోమోలు ఇచ్చి, తరువాత నుంచి చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో సిబ్బంది కృషి చేయాలన్నారు. రైతులు, విద్యార్థుల సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కొంత మంది సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ అధికారులే హద్దులు తేల్చాలి

వేటపాలెం: చీరాల నియోజకవర్గ పరిధిలో ఉన్న డ్రైనేజీలకు (స్ట్రయిట్ కట్) సంబంధించిన భూములు ఏ మేరకు ఉన్నాయో మాకు తెలియదని ఇరిగేషన్ అధికారుల మాటలివి. శుక్రవారం సాక్షి దిన పత్రికలో 'పచ్చనేత.. డబ్బు మేత' కథనం ప్రచురించింది. కాల్వ కట్టలపై మార్కెట్ కోసం అధికారులు షెడ్లు అక్రమంగా నిర్మించారని కథనంలో పేర్కొంది. శనివారం కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు స్ట్రయిట్ కట్ కాల్వకు సంబంధించి ఎంత భూమి ఉందో హద్దులు నిర్ణయించలేదన్నారు. దీని హద్దులు తెలియజేయాలని రెవెన్యూ శాఖ అధికారులకు లేఖ రాశామని ఇరిగేషన్ అధికారులు వివరణలో తెలిపారు. అంటే తమ శాఖలో డ్రైనేజీలకు సంబంధించిన భూమి ఎంత ఉందో ఆశాఖ అధికారులకు తెలియకపోవడం శోచనీయం. రెవెన్యూ అధికారులు స్ట్రయిట్ కట్ భూమి హద్దులు నిర్ణయించిన తరువాత కాల్వ కట్టలపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగిస్తామని ఉన్నతాధికారులు చెప్పకనే చెప్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, డ్రైనేజీ శాఖ అధికారులు కాల్వ కట్ట ఆక్రమణలపై త్వరగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో ప్రవహిస్తున్న రొంపేరుకు అనుసంధానంగా రామన్నపేట, ఈపురుపాలెం గ్రామాల దగ్గరలో 1969లో రొండా నారప రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో రొంపేరు వరద నీరు సముద్రంలోకి నేరుగా చేరడానికి దాదాపు 4.50 కిలో మీటర్ల మేర స్ట్రయిట్ కట్ మురుగు నీటి కాలవలు తవ్వించారు. ఈ కాల్వ తవ్వించే సమయంలో భూసేకరణ చేసి సంబంధిత శాఖల ద్వారా కాంట్రాక్టు పనులు ఇచ్చారు. కాని అధికారులేమో మాకు తెలియదని చెప్పడం విడ్డూరం.


పచ్చనేత.. డబ్బు మేత !

సాక్షిలో ప్రచురితమైన కథనం

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న దాతలు

చినగంజాం: పేద విద్యార్థులకు దాతలు సైకిళ్లు పంపిణీ చేశారు. మండలంలోని సంతరావూరు ప్రాథమికోన్నత పాఠశాలలో నలుగురు 8వ తరగతి విద్యార్థులకు వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్, చిలకలూరి పేట రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు అందజేశారు. శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాద్, వెంకటరాయ శ్రీధర్ ఫౌండేషన్ కార్యదర్శి తోటకూర వెంకటనారాయణ, మాజీ జడ్పీటీసీ యార్లగడ్డ లక్ష్మి, సీఎంసీ చైర్మన్ సాయని మహేష్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళన కార్తీక సమారాధన

అద్దంకి రూరల్: వాసవీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో ఆదివారం శింగరకొండలోని నిత్యాన్నదాన సత్ర ప్రాంగణంలో ఆర్యవైశ్య సమ్మేళన కార్తీక సమారాధన నిర్వహించనున్నట్లు సత్ర కమిటి సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు సృజన కవి సమ్మేళనం

అద్దంకి రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయం వద్ద సృజన కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు సుగుణరావు, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకర్‌దత్ కార్యదర్శి అనికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సాహిత్యాభిమానులు పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

విద్యార్థుల హాజరు పెంచాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో

బల్లికురవ: తరగతుల వారీగా విద్యార్థుల హాజరు పెంచాలని.. లేకపోతే ఉపాధ్యాయ పోస్టులు రద్దు అవుతాయిని డిప్యూటీ డీఈవో ఏ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం పాతమల్లాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఇకటి నుంచి 8 తరగతుల్లో గత విద్యా సంవత్సరంలో 123 మంది విద్యార్థుల రోల్, ఈ ఏడాది 90కి పడిపోవటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో పాఠశాల హెచ్ఎం ఎస్ ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌లను నియమించాలి


మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగేంద్రరావు

చీరాల రూరల్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు జుడిషియల్ పవర్ కల్పించి ఆయా కమిషన్‌లకు చైర్మన్‌లను నియమించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద మాచవరపు జూలియస్‌తో కలసి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా ఇంతవరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు చైర్మన్‌లను నియమించలేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో ఎస్సీ,ఎస్టీలపై దాడులు జరుగుతున్నా కేసులు నమోదు చేయడం లేదని విమర్శించారు. పోలీసులు పొరపాటున కేసు నమోదుచేసినా ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని కేసులను తప్పుడుగా సిఫార్సు చేయిస్తూ బాధితులపైనే కౌంటర్ కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలోని ముద్దాయిలకు స్టేషన్‌లో 41 నోటీసులు ఇచ్చి పంపిస్తున్నారని వారు మండిపడ్డారు. అలానే కూటమి ప్రభుత్వం పరిపాలనపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులను, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాకు చెందిన వారిని అరెస్టులు చేయించడంలో నిమగ్నమయ్యిందన్నారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

చినగంజాం: గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ డైరక్టర్ బీ రామనాథం సూచించారు. శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో మండల పరిధిలోని పంచాయతీలలో నిర్వహించే అభివృద్ధి పనులు, వనరుల కేటాయింపు, తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి, ఈఓపీఆర్డీ సుబ్బారావు, ట్రైనింగ్ మేనేజర్ అమర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మెట్లపై జారిపడి వృద్ధుడికి గాయాలు

అద్దంకి రూరల్: కాలు జారి మెట్ల మీద నుంచి జారిపడి వృద్ధుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన శనివారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది వివరాల మేరకు.. మండలంలోని కొటికలపూడి గ్రామానికి చెందిన రైతు కోవి హనుమంతరావు పురుగుల మందు కొనేందుకు స్థానిక పాత పెట్రోలు బంకు ఎదురుగా ఉన్న శాంతి సీడ్స్ ఎరువుల షాపు వద్దకు వచ్చాడు. తిరిగి వెళ్తుండగా ఎరువుల దుకాణం ముందున్న మెట్ల మీదనుంచి జారి పడటంతో తలకు గాయలయ్యాయి. స్థానికులు సమాచారంతో 108 వాహనంలో క్షత గాత్రుడికి టెక్నీషియన్ హరిబాబు ప్రథమ చికిత్స చేశాడు. క్షతగాత్రుడి కోరిక మేరకు అద్దంకిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

ఎన్ఎంఎంఎస్ ఉచిత మోడల్ పరీక్ష

మార్టూరు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబర్ 8వ తేదీ నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షను రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సర్వోత్తమ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈపరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 18వ తేదీ సాయంత్రంలోపు హెచ్ఎంల ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాల కోసం 94407 11784, 99484 37301 నంబర్లలో ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని ఆయన ప్రకటనలో తెలిపారు.